క్లుప్తంగా

నేడు ఉట్లోత్సవం

ఉప్పునుంతల: మండలంలోని మామిళ్లపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద సోమవారం వైష్ణమ కృష్ణ అష్టమిని పురస్కరించుకొని ఉట్లు కొట్టే ఉత్సవం నిర్వహిస్తునట్లు ఆలయ కమిటీ చైర్మన్ వేముల నర్సింహారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ హాజరవుతారని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రేపు సామాజిక తనిఖీ

బిజినేపల్లి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండల వ్యాప్తంగా మంగళవారం సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కథలప్ప ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద తనిఖీలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఆయా గ్రామాల నాయకులు, ప్రజలు హాజరు కావాలని కోరారు.

వంట సామగ్రి వితరణ



వెల్దండ: మండలంలోని గుండాల అంబా రామలింగేశ్వరస్వామి దేవాలయానికి కల్వకుర్తి పట్టణానికి చెందిన స్వప్న, అనిల్ దంపతులు రూ.20వేల విలువ చేసే వంట సామగ్రి వితరణ చేశారు. ఆలయంలో ప్రతి సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు నరహరిశర్మ, శివశర్మ తెలిపారు. అర్చకులు సురేష్‌శర్మ, సంతోష్‌శర్మ తదితరులు ఉన్నారు.

త్రైత సిద్ధాంతంపై ప్రచారం



తెలకపల్లి: మండలంలోని గౌరారంలో ఆదివారం త్రైత సిద్ధాంత గ్రంథాలపై జ్ఞాన ప్రచారం ప్రబోద సేవా సమితి నాగర్‌కర్నూల్, అచ్చంపేట శాఖ సభ్యులు అవగాహన కల్పిస్తూ ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి భగవద్గీతపై ప్రచారం చేస్తూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో సాయిశేఖర్, శేష్ట, రమాదేవి, ఆంజనేయులు, మంజుల, స్వప్న, రాము, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప స్వాముల ఇరుముడులు



తెలకపల్లి: మండల కేంద్రంలో వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అయ్యప్ప మాలధారణ స్వాముల ఇరుముడి కార్యక్రమం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములకు జూపల్లి మాధవి మోహన్‌రావులు అయ్యప్ప భక్తులకు బిక్ష, భక్తులకు అన్నదానం చేశారు. ఇరుముడుల అనంతరం అయ్యప్ప స్వాములను మండల పురవీధుల గుండా భజనలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గురు స్వాములతో కలిసి కేరళలోని అయ్యప్పస్వామి దేవాలయ సన్నిధానికి బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వాముల కుటుంబ సభ్యులు బంధువులు భక్తులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

వెల్దండ: మండల కేంద్రానికి చెందిన కొప్పు నర్సింహ అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆదివారం బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా జోగయ్య బాధిత కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. మాజీ ఉపసర్పంచ్ నిరంజన్, నాయకులు లింగంముదిరాజ్, నిరంజన్, అంజయ్య, శేఖర్, సైదులు, శ్రీను, పర్వతాలు, మల్లేష్ తదితరులు ఉన్నారు.

నిలిచిన రాకపోకలు

కల్వకుర్తిరూరల్: మండలంలోని రామగిరి, రఘుపతిపేట మధ్యలో ఉన్న దుందుబినది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఆదివారం వాగుమీదుగా వెళ్లేందుకు ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. ముందు జాగ్రత్త చర్యలో భాగంగా ఆర్టీసీ అధికారులు కల్వకుర్తి, తెలకపల్లి మధ్యలో ప్రయాణించే ఆర్టీసీ బస్సులను నిలిపివేశారు. వాగుపై బ్రిడ్జి నిర్మాణం పూర్తికాకపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది.



ఆశావహుల ఎదురుచూపులు

- స్థానిక ఎన్నికల కోసం నిరీక్షణ
- పార్టీ పెద్దల ప్రసన్నంలో నాయకులు



అల్లాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

మన్ననూర్: స్థానిక సంస్థల ఎన్నికల కోసం మండల, గ్రామ స్థాయి నాయకులు ఎప్పుడెప్పుడా అని రెండేళ్లుగా ఎదురుచూస్తున్నారు. ఈ మధ్య కాలంలో ఆయా పార్టీల అసెంబ్లీ స్థాయి ముఖ్య నాయకుల సమావేశాలు, పార్టీల చేరికలు ఉమ్మడి అమ్రాబాద్ మండలంలో జోరందుకోవడంతో పాటు జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ పదవులకు పోటీ చేసే అభ్యర్థులు స్థానిక సంస్థల ఎన్నికల కోసం నిరీక్షిస్తున్నారు. ఎన్నికలకు సిద్ధం కావాలంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీల తరుపున ముఖ్య కార్యకర్తల సమావేశాలు కూడా ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. పోటీ చేసే అభ్యర్థులు నియోజకవర్గం స్థాయి నాయకులను ప్రసన్నం చేసుకొంటూ తమ క్యాడర్ నాయకులతో ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఇదిలా ఉండగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణను కొందరు నాయకులు తరుచుగా కలుస్తూ అదే పనిగా వెంట తిరుగుతూ అవకాశం కల్పించాలని ప్రాధేయపడుతున్నట్లు తెలుస్తుంది. ఇక ప్రతిపక్ష బీఆర్ఎస్ ముఖ్య నాయకుడు గువ్వల బాల్‌రాజ్ బీజేపీలో చేరడంతో ఆ పార్టీ మండల, గ్రామ స్థాయి నాయకులలో అయోమయ పరిస్థితి ఏర్పడింది. నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు తీసుకుని పార్టీ క్యాడర్‌ను ప్రోత్సహిస్తున్నారు. బీజేపీ విషయానికి వస్తే నియోజకవర్గంలో బీఆర్ఎస్ స్థానంలో ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్ పార్టీకి గట్టి పోటీ ఇచ్చే అవకాశం ఉంది. ప్రత్యేకించి అచ్చంపేట నియోజకవర్గంలోని అమ్రాబాద్ మండలంలో సాగునీటి సమస్య, బల్మూర్ మండలంలో రిజర్వాయర్ నిర్మాణంతో భూములు కోల్పోవడం వంటి పలు సమస్యలు ఆయా పార్టీల నాయకులకు స్థానిక ఎన్నికల్లో కొంత ఇబ్బందిగానే ఉండవచ్చునని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఎన్నికలు నిర్వహించాలి

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం స్థానిక సంస్థల ఎన్నికలు వెంటనే నిర్వహించాలి. ప్రత్యేక అధికారుల పాలనలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. గ్రామాలలో అభివృద్ధి పనులు జరుగడం లేదు.

–పెర్ముల గోపాల్, అచ్చంపేట డివిజన్ సీపీఐ డివిజన్ కార్యదర్శి

వీరుల త్యాగాలు చిరస్మరణీయం



డైరీని ఆవిష్కరిస్తున్న తెలంగాణ సాహితీ కవులు

కందనూలు: తెలంగాణ సాయుధ పోరాట వీరుల త్యాగాలు చిరస్మరణీయమని తెలంగాణ సాహితీ పాలమూరు జిల్లా కార్యదర్శి ఖాజమైనోద్దీన్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు భవనంలో తెలంగాణ సాహితీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట కాలం నాటి సాహిత్య సమాలోచన కార్యక్రమాన్ని భానుచందర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాయుధ పోరాట యోధులు రావి నారాయణ రెడ్డి, పుచ్చలపల్లి సుందరయ్య, బద్దం ఎల్లారెడ్డి, మాకినేని, ఆరుట్ల కమలాదేవి, ఐలమ్మ, మల్లు స్వరాజ్యం తదితరులకు నివాళులర్పించారు. వారి స్ఫూర్తితో సాహిత్య రూపంలో కథలు, కవిత్వం విస్తృతంగా రావాల్సిన అవసరం ఉందని వక్తలు అభిప్రాయపడ్డారు. దాశరథి, వట్టి కోట ఆళ్వార్ స్వామి, సుద్దాల హనుమంతు, కాళోజీ, మగ్దూం మొయిద్దీన్, షోయబుల్లఖాన్ లాంటి సాహితీవేత్తలు ఈ పోరాటంలో భాగంగా సాహిత్య సేద్యం చేశారని వివరించారు. కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కవుల రచయితల డైరీని ఆవిష్కరించారు. రాష్ట్రస్థాయి పురస్కారాలు, గుర్తింపు పొందిన పద్మాలయాచార్య, ముచ్చర్ల దినకర్, రఘురాములుగౌడ్‌లను సన్మానించారు. కార్యక్రమంలో ముచర్ల దినకర్, లక్ష్మణాచారి, వెంకటేశ్వర్లు, కల్వకోలు మదిలేటి, కృష్ణయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలి



పెద్దకొత్తపల్లి: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని మార్కెట్ కమిటీ చైర్మన్ దండు నర్సింహ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసి ఇళ్ల నిర్మాణానికి ఆయన భూమి పూజ చేసి మాట్లాడారు. నిబంధనల ప్రకారం ఇళ్లు నిర్మించుకోవాలన్నారు. మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు మాధవి, శశికళ, అశోక్‌రెడ్డి, శివశంకర్, మత్స్యకార్మిక సంఘం మండల అధ్యక్షుడు ఎల్లయ్య, సింగిల్ విండో డైరెక్టర్ దండు చంద్రయ్య, మల్లేష్, కేశవులు, ఎల్లయ్య పాల్గొన్నారు.

వర్షాలకు కూలిన మట్టి ఇల్లు



కల్వకుర్తిరూరల్: మండలంలోని రఘుపతిపేటలో బ్రహ్మచారికి సంబంధించిన ఇల్లు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆదివారం కూలింది. ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని బాధితుడు వాపోయాడు. ఇంట్లో ఎవరు లేని సమయంలో ఇల్లు కూలిపోవడంతో ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

మూతపడ్డ పశువైద్య శాల



పెద్దకొత్తపల్లి: పెద్దకారుపాములలోని గ్రామీణ పశు వైద్యశాలను రూర్బన్ మిషన్ పథకం ద్వారా రూ.10 లక్షలతో నిర్మించారు. ప్రభుత్వం సిబ్బందిని నియమించకపోవడంతో రెండు సంవత్సరాల కిందట నిర్మించిన పశువైద్య శాల ఇప్పటికీ తెరుచుకోలేదు. గొర్రెలు, మేకలు, ఆవులు, గేదెలు రోగాలబారిన పడితే మండల కేంద్రానికి వెళ్లి వైద్యం చేయించుకునే పరిస్థితి దాపురించిందని కాపరులు వాపోతున్నారు. ప్రభుత్వం పశువైద్య సిబ్బందిని నియమించి మూతపడ్డా పశువైద్య శాలను తెరిపించాలని రైతులు కోరుతున్నారు.

వెనకబడిన కులాల అభివృద్ధే ధ్యేయం



ఎమ్మెల్యే వంశీకృష్ణను సన్మానిస్తున్న మహిళలు

అచ్చంపేట రూరల్: వెనకబడిన కులాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో రాజపుత్ర బొందిలి సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. బొందిలి సమాజ సంక్షేమం కోసం కృషి చేస్తానన్నారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన బొందిలి కుల అభివృద్ధికి పాటుపడుతానన్నారు. కమ్యూనిటీ హాలు, మహావీర రాణాప్రతాప్ సింగ్ విగ్రహా ఏర్పాటుకు తోడ్పాటు అందిస్తామన్నారు. కార్యక్రమంలో పండరీబాయి, విక్రమ్‌సింగ్, రేణుక, రాజేందర్, మల్లేష్, బాలాజీ, రాణాప్రతాప సింగ్, మన్ను పటేల్, అశోక్‌ప్రసాద్, సునీతాబాయి, రాంబాయి, సంధ్యాబాయి, దుర్గాబాయి పాల్గొన్నారు.

కోర్టు భవనాలు నిర్మించాలని వినతి



కల్వకుర్తి టౌన్: పట్టణంలోని సీనియర్, జూనియర్ సివిల్ కోర్టులు ఉన్న భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయని, నూతన భవన ఏర్పాటుకు కృషి చేయాలని హైకోర్టు జడ్జి విజయ్‌సేన్ రెడ్డికి కల్వకుర్తి బార్ అసోసియేషన్ సభ్యులు వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్‌లోని ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి కల్వకుర్తి కోర్టులో ఉన్న సమస్యలను ఆయనకు వివరించారు. కోర్టు నూతన భవనం ఏర్పాటుకు తగిన స్థలం ఉందని, నిధుల విడుదలలో చొరవ చూపాలని వారు కోరారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారు. కల్వకుర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, న్యాయవాదులు వెంకట్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, మల్లేష్‌లు ఉన్నారు.

పేదలందరికీ ఇళ్లు మంజూరు చేయాలి



పెంట్లవెల్లి: పేదలందరికీ ఇళ్లు మంజూరు చేయాలని మండల బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రసిడెంట్ గోవు రాజు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పేదల ఇళ్లను పరిశీలించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులకే ఇందిరమ్మ ఇస్తున్నారని ఆరోపించారు. పారదర్శకంగా ఇళ్లు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు యాగోస్, బత్తినిరాజు, బుచ్చన్నలు పాల్గొన్నారు.

ఇందిరమ్మ 'నమూనా' ఇల్లు పూర్తి



తాడూరు: మండల కేంద్రంలోని పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్మించిన ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణం పూర్తయ్యిందని ఎంపీడీఓ ఆంజనేయులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో ప్రత్యేకంగా ఇందిరమ్మ ఇల్లు నమూనాను ప్రదర్శించే విధంగా నిర్మాణం చేశామని పేర్కొన్నారు. త్వరలో ప్రజాప్రతినిధుల ప్రారంభిస్తారని తెలిపారు.

మైసమ్మ జాతరకు భక్తుల రద్దీ



పెద్దకొత్తపల్లి: మైసమ్మ జాతరకు ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. నాలుగు వారాలుగా భక్తుల రద్దీ లేక జాతరలో వస్తువులు అమ్ముకునే వారికి గిరాకి లేక ఇబ్బందులు పడ్డారు. ఆదివారం పది వేల మంది భక్తులు హాజరై మైసమ్మను దర్శించుకున్నారు. వనపర్తి, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్ ఆర్టీసీ డిపోల నుంచి మైసమ్మ జాతరకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులను నడిపించారు.

కొనసాగుతున్న వర్కర్ల సమ్మె



కొల్లాపూర్‌లో నిరసన తెలుపుతున్న హాస్టల్, ఆశ్రమ పాఠశాలల వర్కర్లు



మన్ననూరులో నినాదాలు చేస్తున్న వర్కర్లు

లింగాల: డిమాండ్ల సాధన కోసం వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల వర్కర్లు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం నాటికి మూడో రోజుకు చేరింది. మండలంలో గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలల, అప్పాయపల్లి, క్యాంపురాయవరం, అప్పాపూర్‌పెంటలో ఏటీడీఏ ఆధ్వర్యంలో కొనసాగే ఆశ్రమ పాఠశాలల వర్కర్లు ఆయా ఆశ్రమ పాఠశాలల ఎదుట బైటాయించి సమ్మె చేస్తున్నారు. దీంతో విద్యార్థులకు భోజనాలు వండేందుకు ఉపాధ్యాయులు ఇబ్బందులు పడ్డారు. తరగతుల నిర్వహణ కొనసాగలేదు. ప్రభుత్వ తక్షణ చర్యలు తీసుకొని వర్కర్ల డిమాండ్లను పరిష్కరించి సమ్మె విరమింప చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కొల్లాపూర్: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శివవర్మ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం పట్టణంలోని ఎస్టీ బాలికల హాస్టల్ వద్ద వర్కర్లు సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా శివవర్మ మాట్లాడుతూ హాస్టల్, ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న వర్కర్లను పర్మినెంట్ చేయాలన్నారు. దామోదర్, వెంకటేష్, బాలస్వామి, రమణమ్మ, పార్వతమ్మ, శారదమణి, ఊషమ్మ తదితరులు ఉన్నారు.

మన్ననూరులో..

మన్ననూర్: గిరిజన ఆశ్రమ సంక్షేమ వసతి గృహాల్లో విధులు నిర్వహిస్తున్న దినసరి వేతనం వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన నిరవధిక దీక్షలు ఆదివారం 3వ రోజు చేరుకుంది. ఈ సందర్భంగా జిల్లా నాయకురాలు పద్మ మాట్లాడుతూ 6 నెలలుగా జీతాలు చెల్లించడం లేదన్నారు. దీంతో కుటుంబాల పోషణ భారంగా మారిందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. వర్కర్లు అంజమ్మ, మల్లమ్మ, చిట్టి, కళమ్మ, పార్వతమ్మ, చిన్నమ్మ, దస్లీ, విజయ, ఏడుకొండలు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ఉప్పునుంతల: ప్రభుత్వం గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం శంకర్‌నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన మండలంలోని గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రెండో మహాసభలలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు గడస్తున్నా ఇంతవరకు కార్మికులకు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి కూడా నెరవేర్చలేదని విమర్శించారు. కార్మికులకు కనీస వేతనం నెలకు రూ. 26 వేలు చెల్లించడంతపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఆ సంఘం మండల అధ్యక్షుడు సుల్తాన్, చింతల నాగరాజు, జిల్లా నాయకులు మల్లేష్, సైదులు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

డిగ్రీలో ప్రవేశానికి చివరి అవకాశం

కందనూలు: ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు డిగ్రీలో చేరేందుకు ఈ నెల 15, 16 తేదీలలో చివరి అవకాశం ఉందని నాగర్‌కర్నూల్ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మదన్మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు డిగ్రీలో అడ్మిషన్ పొందని విద్యార్థులు స్పాట్ అడ్మిషన్ ప్రక్రియ ద్వారా నేరుగా కళాశాలలో చేరవచ్చని తెలిపారు. విద్యార్థులు తప్పనిసరిగా తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకొచ్చి కళాశాలలో సంప్రదించాలని సూచించారు. సోమవారం, మంగళవారం మాత్రమే ఈ స్పాట్ అడ్మిషన్ సదుపాయం అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు సెల్: 9010396939, 9492172455 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఘనంగా జాతీయ హిందీ భాష దినోత్సవం



వెల్దండ: మండలంలోని గుండాల ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఆదివారం జాతీయ హిందీ భాష దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హిందీ భాషపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుమన్ కుమార్ మాట్లాడారు. పాఠశాల దశలోనే హిందీభాషాపై పట్టు సాధించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కోడం భాస్కర్, ఉపాధ్యాయులు ప్రవీణ్, సోను, ధర్మేందర్, చంద్రబాబు, ప్రియ, కవిత తదితరులు ఉన్నారు.

కరాటేలో మెడల్స్



బిజినేపల్లి: గద్వాలలో ఈ నెల 12, 13, 14 తేదీల్లో నిర్వహించిన ఇంటర్ డిస్ట్రిక్ట్ రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో మండలానికి చెందిన 6 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ రాగా, నలుగురు సిల్వర్ మెడల్స్ సాధించారు. మరో 9 మంది విద్యార్థులకు కాంస్య పతకాలు అందుకున్నారు. బిజినేపల్లి, వట్టెం, మహదేవునిపేట, మంగనూర్ గ్రామాల నుంచి 23 మంది విద్యార్థులు కరాటే పోటీల్లో పాల్గొన్నారు. అందులో గోల్డ్ మెడల్స్ సాధించిన 6 మంది విద్యార్థులు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని రాయ బరేలి జిల్లాలో నవంబర్ 7 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించే జాతీయ స్థాయి తైక్వాండో క్రీడల్లో పాల్గొంటారని తైక్వాండో తెలంగాణ సెక్రెటరీ మాస్టర్ శ్రీహరి, జిల్లా కార్యదర్శి శేఖర్, కోచ్‌లు ధనలక్ష్మిలు తెలిపారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

కోడేరు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫిర్యాదులు ఉంటే ప్రజావాణిలో పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు తప్పని సరిగా హాజరు కావాలని కోరారు.

శిథిలావస్థలో పాఠశాల అదనపు గది



ప్రాథమిక పాఠశాలలో అదనపు గది ఇలా..

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలల్లో అదనపు గది నిర్మాణంలోనే శిథిలావస్థకు చేరుకుంది. 2012వ సంవత్సరంలో అదనపు గది నిర్మాణం కోసం సర్వశిక్ష అభియాన్ ద్వారా రూ. 2 లక్షలు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్ గది నిర్మాణాన్ని కప్పు లేవల్ వరకు నిర్మించి వదిలిపెట్టడంతో 13 సంవత్సరాల కిందట నిర్మించిన ఈ గది నేడు శిథిలావస్థకు చేరుకొని కూలడానికి సిద్ధంగా ఉంది. గది నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసి నిర్మాణం పూర్తి చేయాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడిగా మహిపాల్ నాయక్

చారకొండ: మండలంలోని తుర్కలపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పని చేస్తున్న మహిపాల్ నాయక్ లయన్స్ ఇంటర్నేషనల్ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం భగీరథ కాలనీలో ఓ గార్డెన్‌లో లయన్స్ గవర్నర్ మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేశారు. మండలంలోని ఉపాధ్యాయులు, తుర్కలపల్లి గ్రామస్తులు మహిపాల్ నాయక్‌ను అభినందించారు.

పేదల ఆరోగ్యానికి కృషి



పాత్రికేయులతో సుంకిరెడ్డిరాఘవేందర్‌రెడ్డి

కల్వకుర్తిరూరల్: పేదల ఆరోగ్యానికి కృషి చేస్తానని ఐక్యత పౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డిరాఘవేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఐక్యత కార్యాలయ ఆవరణలో ఐక్యత ఫౌండేషన్ వన్‌మెడి సహకారంతో డివిజన్ పరిధిలోని వెల్దండ, చారగొండ, కల్వకుర్తి మండలాలకు చెందిన 130 మందికి పైగా ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా జర్నలిస్టులకు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పరీక్షలు చేశారు. సమాజంలో పాత్రికేయ వృత్తి గొప్పదని ఆయన కొనియాడారు. కల్వకుర్తి నియోజకవర్గంలో 240 మంది జర్నలిస్టులకు ఐక్యత పౌండేషన్ ద్వారా వైద్య పరీక్షలతో పాటు ఆరోగ్య పరిరక్షణకు ఆర్గానిక్ హెల్త్ కిట్లు అందించామన్నారు. కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ సభ్యులు నరేందర్‌గౌడ్, రఘు, యాదయ్య, శ్రీపతి, కల్యాణ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలి



మాట్లాడుతున్న బిజ్జ శ్రీనివాసులు

కోడేరు: మండలంలోని తీగలపల్లి రిజర్వాయర్‌లో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బిజ్జ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం 14వ రోజు రిలే దీక్షలు కొనసాగడంతో ఆయన పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ భూములు కోల్పోయిన రైతులు రిలే దీక్షలు చేస్తున్నా మంత్రి జూపల్లి కృష్ణారావుకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. 47 ఎకరాల 19 గుంటల భూమికి ప్రభుత్వం వెంటనే స్పందించి పరిహారం చెల్లించాలన్నారు. నారాయణపేట, కొడంగల్ ఏరియాలో రైతులకు నష్టపరిహారం చెలించిన విధంగా తీగలపల్లి నిర్వాసితులకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల సీపీఎం కార్యదర్శి కిరణ్‌కుమార్, చంద్రశేఖర్, స్వామి లక్ష్మయ్య, గోపాల్, బొందయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళా అదృశ్యం: కేసు నమోదు



లింగాల: మండలంలోని కొత్తచెర్వుతండాకు చెందిన వివాహిత ఆరెకంటి లక్ష్మి అదృశ్యంపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్‌గౌడు తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం ఈ నెల 12న భర్త కురుమయ్యతో కుటుంబ విషయంలో గొడవపడ్డారు. మేకలను తీసుకొని ఆమె భర్త పొలం వద్దకు వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి రాగ భార్య కన్పించలేదు. దీంతో బంధువులు, ఇతర ప్రాంతాలలో వెతికినా ఆచూకి లభ్యం కాలేదు. భర్త కురుమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.